క్లుప్తంగా

ఈవోపీఆర్డీకి చేరిన పింఛను నగదు

సాక్షి ఎఫెక్ట్..

కలువాయి(సైదాపురం) : కలువాయి మండలం కుల్లూరు సచివాలయం-2లో పింఛనుదారులకు చెల్లించని నగదును జీఎల్ఎం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఆదివారం ఈవోపీఆర్డీకి అందజేశారు. పింఛనుదారులకు నగదు చెల్లించని వైనంపై పింఛను నగదు పంపిణీలో జాప్యం అన్న శీర్షికన ఆదివారం సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై జీఎల్ఎం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు స్పందించి పింఛన్ నగదు రూ.80 వేలను ఈవోపీఆర్డీ రమేష్‌కు అందజేశారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జుల పాలన

కలువాయి(సైదాపురం) : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇన్‌చార్జుల పాలనే కొనసాగుతోంది. రాపూరు ఎంపీడీవో భవానికి ఇన్‌చార్జి ఎంపీడీవోగా అధికారులు బాధ్యతలు అప్పగించారు. అలాగే ఇన్‌చార్జి ఈవోపీఆర్డీగా కుల్లూరు రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి, అనంతసాగరం మండల పంచాయతీరాజ్ ఏఈ శివారెడ్డి, రాపూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజనేయులు, చేజర్ల మండలం రెగ్యులర్ ఏపీవో వెంకటేశ్వర్లు కలువాయి మండల ఇన్‌చార్జి అధికారులుగా వ్యవహరిస్తున్నారు. ఏ అధికారులు ఎప్పుడు ఇక్కడికి వస్తారో తెలియక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ అధికారులను నియమించాలని కోరుతున్నారు.

దేవారెడ్డికి పరామర్శ



దేవారెడ్డి సుధాకర్ రెడ్డితో మాట్లాడుతున్న ఎస్వీ సుబ్రమణ్యం రెడ్డి

చిట్టమూరు : మండలంలోని ఆరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత దేవారెడ్డి సుధాకర్ రెడ్డి తండ్రి దేవారెడ్డి సుబ్బరాఘవరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆ పార్టీ మేధావుల ఫోరమ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సుబ్రమణ్యం రెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకుని సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు. మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం సమీపంలో ఉన్న భగవతి మల్లికాంబ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా హోమియో, కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ప్రముఖ హోమియో వైద్యులు బి.రంగనాథ్, శ్రీలక్ష్మీ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు కంటి పరీక్షలు చేశారు. 10 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. సుమారు 200 మందికి పైగా వైద్య శిబిరాలకు వచ్చినట్టు నిర్వాహకుడు అమాస రామనారాయణ తెలిపారు. గూడూరు సుధీర్ రెడ్డి, అవధానం సుధీర్, ఓటుక నాథస్వామి, అమాస మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో చోరీ

పెళ్లకూరు : మండల కేంద్రమైన పెళ్లకూరులోని దళితకాలనీ సమీపంలో ఉన్న చర్చిలో శనివారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం ఆరాధన కోసం వచ్చిన చర్చి ప్రతినిధులు తలుపులు తెరిచి చూడగా సౌండ్ సిస్టమ్, డీజే బాక్సులు, విలువైన మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ను చోరీ చేసినట్టు గుర్తించారు. వాటి విలువ రూ.35 వేలు ఉంటుందని తెలిపారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ నాగరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

10న హుస్సేనమ్మ గంధోత్సవం

దొరవారిసత్రం : మండలంలోని నెలబల్లిలో వున్న హుస్సేమ్మ దర్గా 55వ గంధోత్సవం ఈ నెల 10, 11, 12 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. తొలి రోజు గంధం ఊరేగింపు, తెనాలి వారి బ్యాండ్ కార్యక్రమాలు, రెండో రోజు పాటకచేరి, మూడో రోజు కళాకారుల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

సుడిగాలితో విద్యుత్‌కు అంతరాయం

కలువాయి(సైదాపురం) : మండలంలో శనివారం రాత్రి సుడిగాలి వీయడంతో పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. లలితానగర్ తదితర ప్రాంతాల్లో ప్రస్తుతం వరి కోతలు పూర్తయ్యాయి. సుడిగాలికి గడ్డిపైకి లేచి 33 కేవీ విద్యుత్ తీగలకు చుట్టుకుంది. ఒక్కసారిగా విద్యుత్ లైన్ నుంచి మంటలు చెలరేగాయి. దీంతో పలు గ్రామాలకు 4 గంటలకు పైగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది. స్పందించిన అధికారులు ఘటన ప్రదేశానికి చేరుకుని విద్యుత్ తీగలకు చుట్టుకున్న గడ్డిని తొలగించారు. అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ముక్కులు మూసుకోవాల్సిందే..



మండల కేంద్రమైన చిట్టమూరుకు కూతవేటు దూరంలోని నాయుడుపేట-మల్లాం రోడ్డుకు ఇరువైపులా కోళ్ల వ్యర్థాలు, చెత్తా చెదారం వేస్తున్నారు. అవి కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ముక్కులు మూసుకోవాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. కొత్తగుంట గ్రామంలో ఉన్న చికెన్ షాపుల నుంచి కోళ్ల వ్యర్థాలు రోడ్డు పక్కనే పడేస్తున్నారు. వ్యాపారులు చెత్తను, ప్లాస్టిక్ కవర్లను అక్కడే వేస్తున్నారు. గాలులకు ప్లాస్టిక్ కవర్లు ద్విచక్ర వాహన దారులపై పడుతున్నాయి. అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి ఇకమీదట ఎవరూ వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – చిట్టమూరు

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

చిల్లకూరు మండలం బల్లవోలు, చింతవరం గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో రూ.5 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ భవనాలు అసంపూర్తిగా వున్నాయి. బల్లవోలులో భవనాన్ని అప్పట్లో సూపర్‌వైజర్ నిర్మాణ పనులు చేపట్టారు. లెంటల్ లెవల్ వరకు భవనాన్ని పూర్తి చేశారు. చింతవరంలో పూర్తి చేయలేదు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. దీనిపై చింతవరం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతిని వివరణ కోరగా చింతవరం భవనం నిధులు బ్యాంకులో ఉన్నాయని, బల్లవోలు భవనానికి నిధుల అవసరం ఉందని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందిన వెంటనే పనులు పూర్తి చేస్తామన్నారు. – చిల్లకూరు



వెలగని సోలార్ లైట్లు





మండలంలోని మినమనముడి, పోలిరెడ్డిపాళెం రైల్వే స్టేషన్, వేటగిరపాళెం, తల్లంపాడు, మేలుపాక, అక్కరపాక, కుప్పారెడ్డిపాళెం తదితర గ్రామాల ప్రజల సౌకర్యం కోసం స్వర్ణ టోల్ ప్లాజా వారు ఏర్పాటుచేసిన సోలార్ లైట్లు పనిచేయడం లేదు. వీటికి రూ.లక్షలు వెచ్చించి ఏడేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణను రోడ్డు నిర్వహణ సంస్థ, పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. సోలార్ ప్యానళ్లు, బ్యాటరీలు, లైట్లు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సోలార్ లైట్లు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. – దొరవారిసత్రం

చిట్టమూరు : స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం, సూళ్లూరుపేట: ఎమ్మెల్యే విజయశ్రీకి సత్కారం, ఓజిలి : రాచపాళెంలో పూజలు చేస్తున్న పండితులు, వెంకటగిరి రూరల్ : కోదండరామస్వామి ఆలయంలో కల్యాణం, సైదాపురం : ఉత్సవమూర్తుల ఊరేగింపు











ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

ఓజిలి/నాయుడుపేట టౌన్/చిట్టమూరు/కోట/వెంకటగిరి రూరల్/సైదాపురం/సూళ్లూరుపేట/గూడూరు రూరల్/చిల్లకూరు/వాకాడు/రాపూరు : సూళ్లూరుపేట, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీతారాములుకు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని శాస్త్రోక్తం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు.

- ఓజిలి మండలంలోని రాచపాళెం, పెదపరియ రాచపాళెం, పెదపరియ గ్రామాల్లోని శ్రీరాముని ఆలయాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. పెదపరియలో ప్రకాష్‌నాయుడు, అనురాధ దంపతులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు.
- నాయుడుపేట పట్టణంలోని రామ మందిరం, రాజగోపాలపురంలోని లక్ష్మణ సమేత సీతారామాంజనేయస్వామి, ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సీతా కోదండరామ స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, అగ్రహారపేటలోని సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేశారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న షిరిడీ సాయిబాబా గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెన్నైకు చెందిన ఎంఎం నరేంద్రనాథ్, యమున దంపతులు గంధాన్ని ఒంటెలు, గుర్రాలపై ఉంచి ఊరేగింపుగా హజరత్ అమీర్‌షావలి దర్గాకు తీసుకువచ్చి ప్రార్థనలు చేశారు.
- చిట్టమూరు మండలంలోని మల్లాంలో ఉన్న రామసాయి మందిరం, జంగాలపల్లిలోని రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి గ్రామోత్సవం చేశారు.
- కోటలోని వైకుంఠరాజస్వామి, వీరాంజనేయ స్వామి, చిట్టేడులోని కోదండరామస్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అన్నదానం, పల్లకీ సేవ చేపట్టారు. విద్యానగర్, కోటలోని షిరిడీ సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు.
- వెంకటగిరి పట్టణం బంగారుపేటలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమిని ఘనంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. సీఐ ఏవీరమణ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న శ్రీరామ మందిరం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.
- సైదాపురం మండలంలోని తురిమెర్ల, తలుపూరు, సైదాపురం, గిద్దలూరు గ్రామాల్లో శ్రీరామ నవమిని ఘనంగా జరుపుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లో ఉరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. తురిమెర్ల, గిద్దలూరు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వారం రోజులు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.
- సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీ బాలాంజనేయ స్వామి, బ్రాహ్మణ వీధిలోని సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సీతారాముల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. బజారులోని కూరగాయల మార్కెట్ సెంటర్, బాపూజీ వీధి, రైల్వే స్టేషన్ రోడ్డు ఎదురుగా, శ్రీ మద్వేంకట రామమూర్తుల ఆలయం, షార్ బస్టాండ్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ- పార్థసారథి దంపతులు, నెలవల సుబ్రమణ్యం తదితరులు ప్రత్యేక పూజలు చేశారు.
- గూడూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రముఖ వైద్యులు జనార్ధనరెడ్డి, రోహిణీ దంపతులు సీతారాముల కల్యాణం జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. విజయదుర్గా ఉప పీఠంలో కోట సునీల్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు.
- చిల్లకూరు మండలం తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గుమ్మళ్లదిబ్బ, కొత్తూరు గ్రామాల్లోని మత్స్యకారులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని తిలకించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.
- రాపూరు మండలంలోని పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం చేపట్టారు. నిర్వహించారు. రాత్రి పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి శ్రీరామ చంద్రుడిగా హనుమంత వాహనంపై కొలువుదీరి దర్శమిచ్చారు. కండలేరులో వెలసిన సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత కోదండరామస్వామి ఆలయంలోనూ కల్యాణం నిర్వహించారు.



సూళ్లూరుపేట : విశేషాలంకరణలో సీతారామలక్ష్మణులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



రాపూరు : పెంచలకోనలో హోమం చేస్తున్న అర్చకులు



నాయుడుపేట బ్రాహ్మణవీధిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు



నాయుడుపేటలో గంధాన్ని గుర్రాలు, ఒంటెలపై ఊరేగిస్తున్న భక్తులు



విశేషాలంకరణలో కోదండ రామస్వామి

- వాకాడు కోదండరామ స్వామి, బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయం, తూపిలిపాళెం రామాలయంలో శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్వామి వార్లకు శాంతి కల్యాణం, ప్రత్యేక పూజలు చేశారు. బాలిరెడ్డిపాళెం పట్టాభిరామాలయంలో శ్రీరామచంద్రుడి మూల విరాట్‌పై సూర్య కిరణాలు పడడంతో భక్తులు తన్మయత్వం చెందారు.



వాకాడు : బాలిరెడ్డిపాళెం శ్రీరాముడిపై ప్రసరిస్తున్న సూర్య కిరణాలు



గూడూరు రూరల్ : సాయి బాబా మందిరంలో సీతారాముల కల్యాణం



చిల్లకూరు : తమ్మినపట్నంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



గూడూరులోని విజయదుర్గ పీఠంలో సీతారాముల కల్యాణం



రాపూరు : పెంచలకోనలో స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు



రాపూరు : పెంచలకోనలో హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి



రాజా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



మహిళా కౌన్సిలర్లతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయనను ఆదివారం వెంకటగిరికి చెందిన పలువురు నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు కలిశారు. శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. అనంతరం ఆయన వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు, ఎస్వీబీసీ మాజీ చైర్మన్ వీబీ సాయికృష్ణయాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్రను మర్యాద పూర్వకంగా కలిశారు. సాయికృష్ణ యాచేంద్ర ఇటీవల స్వల్ప అస్వస్థతకు గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పలు రాజకీయ అంశాలపై చర్చించారు.

ఆశీర్వాదం



పెళ్లి కుమారుడితో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, నాయకులు

నాయుడుపేట టౌన్ : వైఎస్సార్ సీపీ ముస్లిం మైనారిటీ నాయకుడు షేక్ రఫీ కుమార్తె వివాహం ఆదివారం నాయుడుపేట సమీపంలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. ఇందులో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డి, యువత నాయకులు మీజూరు బాల, ముస్లిం మైనారిటీ సూళ్లూరుపేట నియోజవర్గ కన్వీనర్ షేక్ షబ్బీర్, పట్టణ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా, ప్రైవేటు పాఠశాలల యూనియన్ అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆరుగురు కోడి పందెంరాయుళ్ల అరెస్టు

చిల్లకూరు : మండలంలోని వల్లిపేడు గ్రామ సమీపంలో ఆదివారం కోడి పందేలు నిర్వహిస్తున్న వారిపై ఎస్‌ఐ సురేష్‌బాబు దాడి చేశారు. ఆరుగురు కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసి ఆరు బైక్‌లు, రూ.7,450 నగదు, ఒక కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు. వారిని సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

కండలేరులో 47.806 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 47.806 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్య సాయి గంగ కాలువకు 1,320, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ కిందే కూరగాయల దుకాణం





కూరగాయల మార్కెట్ ఎదురుగా ఏర్పాటు చేసిన కూరగాయల దుకాణం (ఇన్‌సెట్) దుకాణం వద్దనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సూళ్లూరుపేట : కూటమి నేతలు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని బజారు వీధులు ఇరుకుగా వుండడం, దీనికి తోడు రోడ్లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఈ క్రమంలోనే కూటమి నేతలు కూరగాయల మార్కెట్ బయట పార్కింగ్ ప్లేస్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందనే కూరగాయల దుకాణాన్ని ఏర్పాటు చేయించారు. దీనిపై స్థానికులు మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఇటీవల తొలగించారు. నాయుడుపేటకు చెందిన కూటమి పార్టీ నాయకుడు ఆదేశాలతో మళ్లీ అదే చోట దుకాణాన్ని ఏర్పాటు చేయించారు. భవిష్యత్తులో ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ఆక్రమణలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఉరుసు విజయవంతంపై అభినందనలు

నాయుడుపేట టౌన్ : అందరు ఐకమత్యంగా పనిచేసి హజరత్ అమీర్‌షావలీ దర్గా ఉరుసును విజయవంతం చేయడం అభినందనీయమని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన ఆదివారం సాయంత్రం అమీర్ షావలీ దర్గా వద్ద ఉరుసు నిర్వహణ కమిటీ సభ్యులు, ఆర్గనైజర్లను సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నాయుడుపేటలో మత సామరస్యతకు ప్రతీకగా నిర్వహించే అమీర్ షావలీ దర్గా ఉరుసును వివాదాల వల్ల 9 ఏళ్లు నిలిపివేసినట్టు తెలిపారు. నిర్వాహకులతో మాట్లాడి మళ్లీ ఉరుసు నిర్వహించేందుకు కృషిచేశామన్నారు. ఇందుకు సహరించిన డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి, ఇతర శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి ఏటా ఇలాగే కలిసికట్టుగా ఉరుసును జరుపుకోవాలని ఆకాంక్షించారు. అంతకుముందు హుండీల్లోని కానులకను లెక్కించారు. మొత్తం రూ.1,38,600 నగదు వచ్చినట్టు కమిటీ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో నెలవల రాజేష్, షేక్ రఫీ, ఉయ్యాల ప్రవీణ్, దోర్నాదుల గోపాల్, వాసు, దాము, లక్ష్మీపతి, హాజీ నిజామ్, సుబహాని, షరీఫ్, అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.